నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 22 నవంబర్ 2024 | ADILABAD NIRMAL



సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ఇబ్బందులు కలుగకుండా చూడాలి

## బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 21 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం సిరికొండ మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ.1,26,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అలాగే మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. మండలానికి చెందిన గాయక్వాడ్ బాలాజీ, సూర వెంకటస్వామిలు మృతి చెందగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఏవో కైలాష్, మాజీ సర్పంచ్ పెంటన్న, బీఆర్‌ఎస్ నాయకులు రాందాస్, చందు, సూర్యకాంత్ ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

# కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా

ఎదులాపురం, నవంబర్ 21 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల ఆత్మీయ సమితి జిల్లా అధ్యక్షుడు చందావార్ రాకేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 'ప్రజాపాలన.. ప్రజా విజయోత్సవాలను జరపడం కాదు.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీశ్, అబ్దుల్ సలీం, ప్రమోద్, రాజశేఖర్, రవి, నందు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో తూకానికి సిద్ధంగా ధాన్యం

# నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 21 : గంగన్నపేట్ గ్రామంలో రెండు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. రైతులు వడ్లను యంత్రాల సహాయంతో శుభ్రపరిచి, తేమ శాతం 17 కంటే తక్కువగా ఉంటేనే తూకం చేయాలని అధికారులు తెలిపినట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో వడ్లలో పుల్లలు ఉండేది సహజమేనని, ఉన్న ఒక్క యంత్రంతో వేల క్వింటాళ్ల వడ్లు శభ్రపర్చాలంటే నెల రోజులకుపైగా పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఇలాగైతే కల్లాల వద్దే పగలు, రాత్రి ఉండాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. గతంలో వడ్లు శుభ్రపరచకుండా 40 కిలోల సంచికి 2 కేజీలు ఎక్కువగా తూకం వేసేవారు. అదేవిధంగా తూకం వేయాలని రైతులు కోరుతున్నారు. వడ్లను శుభ్రపరచాలని, 40 కేజీల సంచికి ఒక కేజీని అదనంగా తూకం వేయాలని అధికారులు సూచించడంతో వడ్ల యంత్రం సహాయంతో శుభ్రపరచడం తమ వల్లకాదని విరమించుకున్నారు. దీంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో డీఎం సుధారాణిని వివరణ కోరగా.. గతంలో మాదిరిగా కొనుగోళ్లు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు.

# ట్రాక్టర్‌పై వెళ్లి.. వైద్యం అందించి..



ట్రాక్టర్‌పై వెళ్తున్న వైద్యురాలు, సిబ్బంది

ఉట్నూర్ రూరల్, నవంబర్ 21 : శాంతాపూర్‌కు గురువారం దంతన్‌పెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సిబ్బందితో కలిసి ఈవా ఫౌండేషన్ సహకారంతో ట్రాక్టర్‌పై గ్రామానికి వెళ్లి వైద్యం అందించారు. హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఈ గ్రామంలో అందరూ ఆదివాసులే. దాదాపు 27 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో అంబులెన్స్ రాలేని పరిస్థితి. అందువల్ల వైద్య సిబ్బంది ట్రాక్టర్‌పై వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి మందులు అందించారు. పది మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. రాంబాయి, నూర్‌సింగ్, ఎల్లవ్వ, వరలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.



మొరం పోసి చదును చేస్తున్న నేరుడుపల్లి గిరిజనులు

# ఊరంతా కదిలారు.. రోడ్డు బాగు చేసుకున్నారు..

*చింతగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని నేరుడుపల్లి నుంచి నేరుడుపల్లి గూడ వరకు గిరిజనులు రోడ్డు వేసుకున్నారు. గుంతలు ఏర్పడి నడవడానికి, వాహనాలు పోవడానికి వీలు లేకుండా ఉండడంతో ఊరంతా కదిలారు. ట్రాక్టర్ల ద్వారా మొరాన్ని తరలించి గుంతలను పూడ్చారు. దాదాపు 800 మీటర్ల వరకు రాకపోకలు సాగించడానికి వీలుగా రోడ్డును బాగు చేసుకున్నారు. నేరుడుపల్లిలో దాదాపు 43 ఇండ్లు ఉండగా.. 250 జనాభా.. నేరుడుపల్లి గూడలో దాదాపు 14 ఇండ్లు ఉండగా.. దాదాపు 50 మంది వరకు జనాభా ఉంటారు.* - బోథ్, నవంబర్ 21

# సువిశాల హ్యుందాయ్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ రామ్‌కుమార్

ఎదులాపురం, నవంబర్ 21 : ప్రముఖ కార్ల డీలర్ ప్రకాశ్ హ్యుందాయ్ గురువారం తమ షోరూమ్‌ను అత్యాధునిక సదుపాయాలతో సరికొత్త హంగులతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల ఎదురుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హ్యుందాయ్ మోటార్ ఇండియా రీజినల్ మేనేజర్(ఏపీ, తెలంగాణ) రామ్‌కుమార్, షోరూం ఎండీ దినేశ్‌రెడ్డి, సీఈవో నల్ల ప్రతిహాస్‌రెడ్డి పాల్గొన్నారు. సీఈవో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నగర, చుట్టు పక్కల ప్రాంత ప్రజలకు సేల్స్, సర్వీస్, స్పేర్స్‌లో అత్యాధునిక సదుపాయాలతో షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌వో మేనేజర్ రోహిత్ కుమార్, టీఎస్‌ఎం స్నేహమయి, సర్వీస్ టీఎస్‌ఎం ప్రకాశ్, షోరూం మేనేజర్ ఉమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



తలమడుగు మండలం కజ్జర్ల శివారులో మొరం తవ్వడంతో ప్రమాదకరంగా మారిన గుంతలు

**ఆదిలాబాద్ జిల్లాలో ఆరు రోజుల క్రితం మొరం క్వారీలో పడి మహిళ మృతి**

# అధికారులూ.. చచ్చినా పట్టించుకోరా?

- రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపాటు
- కలెక్టర్ కార్యాలయం ఎదుట నుంచి వందల టిప్పర్లలో మొరం తరలింపు
- రహదారుల పక్కనే ప్రమాదకరంగా మొరం క్వారీలు
- తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్న స్థానిక గ్రామాల ప్రజలు

ఆదిలాబాద్, నవంబరు 21(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో మొరం తవ్వకాలపై అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కుల పాలిట వరంగా మారుతున్నది. అనుమతులు లేకుండా అక్రమార్కులు భారీగా మొ రం తవ్వకాలు చేస్తున్నారు. తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమ మొరం దందాకు అడ్డూ, అదుపు లేకుండా పోతున్నది. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక గ్రామాల ప్రజలు అంటున్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్, కజ్జర్ల.. మావల మండలంలోని బట్టి సవర్ గాం, తాంసి మండలంలోని గుడ్డిగుట్ట, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌దరి, నేరడిగొండ మండలంలోని కుప్టి, కొరిటికల్, వడూర్, బజార్‌హత్నూర్ మండలంలో మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

## కొరవడిన తనిఖీలు

ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరుగుతున్నా అధికారులు నామ్‌కే వాస్తేగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మావల, తాంసి, తలమడుగు మండలాల్లో నాణ్యమైన మొరం లభిస్తుంది. ఈ మండలాల నుంచి జిల్లా కేంద్రంలోని పలు రోడ్లతో పాటు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డు మీదుగా రోజు వందల టిప్పర్లలో మొరం తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ.2 వేల నుంచి రూ.2,300 వరకు వసూలు చేస్తున్నారు. అక్రమ మొరం తవ్వకాలను సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక గ్రామాల ప్రజలు అంటున్నారు. తవ్వకాల కారణంగా క్వారీల్లో భారీగా వర్షం నీరు నిలుస్తుంది. రైతుల పొలాలకు పోయే రహదారులు పక్కన నీరు నిలిచిన క్వారీలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు రోజుల కిందట వ్యవసాయ కూలీలతో పోతున్న ఆటో మొరం క్వారీలో పడడంతో మహిళా కూలీ మరణించింది. అధికారులు స్పందించి మొరం తవ్వకాలను అడ్డుకోవాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తలమడుగు మండలంలోని మొరం క్వారీలో నిలిచిన నీరు



తలమడుగు మండలంలోని కజ్జర్లలో మొరం తవ్వకాలు



ఆదిలాబాద్ సమీపంలోని డంపిగ్‌యార్డు వద్ద మొరం గుంతలో పడ్డ ఆటోను బయటకు తీస్తున్న పోలీసులు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న మొరం తరలిస్తున్న టిప్పర్



దీక్షాంత్ పరేడ్‌లో నూతన కానిస్టేబుళ్లు

# నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

- పీఅండ్‌ఎల్ ఐజీ రమేశ్
- శిక్షణను పూర్తి చేసుకున్న 254 మంది ఎస్సీటీపీసీ సివిల్ కానిస్టేబుల్స్
- అంగరంగ వైభవంగా దీక్షాంత్ పరేడ్

ఎదులాపురం, నవంబర్ 21 : నీతి, నిజాయితీతో విధులను నిర్వర్తిస్తూ ఉద్యోగరీత్యా ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలంగాణ రాష్ట్ర పీఅండ్‌ఎల్ ఐజీ రమేశ్ అన్నారు. స్థానిక పోలీసు శిక్షణా కేంద్రంలో తొమ్మిది నెలలపాటు తర్ఫీదు పూర్తి చేసుకున్న 254 మంది స్టయిఫండరీ ట్రెయినీ సివిల్ కానిస్టేబుల్స్ దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. ఈ శిక్షణలో ఆరు జిల్లాల నుంచి 254 మంది పాల్గొన్నారు. ఇందులో శిక్షణ సివిల్ కానిస్టేబుల్స్ తొమ్మిది నెలలపాటు ఇండోర్, ఔట్‌డోర్ విభాగాల్లో వంద శాతం ఉత్తీర్ణతతో శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ దీక్షాంత్ పరేడ్‌కు ముఖ్య అతిథిలుగా తెలంగాణ రాష్ట్ర పీఅండ్‌ఎల్ ఐజీ రమేశ్‌తోపాటు కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, రెండో బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, శిక్షణ ఐఏఎస్ అభిజ్ఞన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఈరోజు త్రివర్ణ పతాక సాక్షిగా మీరు చేసిన ప్రమాణాన్ని గుర్తు చేసుకుంటూ నిష్పక్షపాతంగా, రాగద్వేషాలు లేకుండా, సమన్యాయంతో విధులను నిర్వర్తించాలని సూచించారు. నీతి, నిజాయితీతో విధులను నిర్వర్తిస్తే పోలీసు ఉద్యోగంలో విజయం సాధించినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అదనపు ఎస్పీ, శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సమయ్ జాన్ రావు, అదనపు ఎస్పీ(ఆపరేషన్) సురేందర్‌రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.



అధికారులతో పీఅండ్‌ఎల్ ఐజీ రమేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, రెండో బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్